


సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

సోమవారం 10-2-2025

సంపుటి: 20 సంచిక: 270

పేజీలు: 8 వెల: రూ.1

# అమ్మా.. స్కూల్ భోజనం తిననే!



"అమ్మా స్కూల్ భోజనం తిననే.. బిర్యానీ చప్పగా ఉంటోంది.. దుంపలూ ఉడకవు.. కుర్మా కారంగా ఉంది.. అన్నం నీరు పట్టినట్టు ఉంటోంది.. ఇంటర్వెల్‌కు ఇచ్చే గుడ్డు ఉడకడమేలేదు.. పోనీ క్యారేజ్ పట్టుకెళ్దామంటే టీచర్ తిడతారు.. పచ్చడి ప్యాకెట్‌తో స్కూల్ అన్నం తినలేకపోతున్నాం.."

**.. ఇదీ స్కూల్ నుంచి రాగానే విద్యార్థులు తమ తల్లిదండ్రుల వద్ద వాపోతున్న వైనం. సాయంత్రం స్కూల్ నుంచి ఇంటికి రాగానే ఇంటిలో మధ్యాహ్నం వండిన అన్నాన్ని ఏమీ లేకపోయినా నీరు వేసుకొని ఉప్పు కలుపుకొని ఆవురావురని తింటున్నారు. దీన్నిబట్టి స్కూల్స్‌లో అందిస్తున్న భోజనం తినలేక 'డొక్క'లు మాడుతున్నాయన్నది స్పష్టమవుతోంది.**



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చదువులు అర్థాకలితో సాగుతున్నాయి. వైకాపా ప్రభుత్వ హయాంలో విద్యార్థులకు జగనన్న గోరుముద్ద పేరిట రుచికరమైన మధ్యాహ్న భోజనం అందించగా, ప్రస్తుతం ఆ పథకం అస్తవ్యస్తంగా మారింది. స్కూల్ పిల్లలు తినలేకపోతున్నారు మహాప్రభో అనుకుంటున్న సమయంలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం పేరిట ఇంటర్ విద్యార్థులకూ ప్రభుత్వం భోజనం అందిస్తోంది.

వైకాపా హయాంలో జగనన్న గోరుముద్ద పేరిట ఏర్పాటుచేసిన మధ్యాహ్న భోజనాన్ని తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనంగా పేరు మార్చింది. ఇందుకు అయ్యే ఖర్చులో 70 శాతం కేంద్రం, 30 శాతం రాష్ట్ర ప్రభుత్వ భరిస్తుంది. ఈ భోజనాలను అక్షయపాత్ర సంస్థ ఆమదాలవలస, గార, శ్రీకాకుళం మండలాల్లో 22వేల మందికి అందిస్తున్నారు. చాలా మండలాల్లోని స్కూల్స్‌లో అక్కడికక్కడ వంటలు చేసి అందిస్తుండటంతో వాటి నుంచి ఫిర్యాదులు రాకపోయినప్పటికీ, అక్షయపాత్ర అందిస్తున్న భోజనం తినలేకపోతున్నామని విద్యార్థులు చెబుతున్నారు. దీనికి కారణం అక్షయపాత్రకు ప్రభుత్వమే బియ్యం అందిస్తుందని, అదీ ఇప్పుడు కొత్త బియ్యం కావడం వల్ల అయితే ముద్దగానో, లేకపోతే రాళ్ల మాదిరిగానో ఉంటోందని తెలుస్తుంది. దీనిపై రాష్ట్రవ్యాప్తంగా పాత బియ్యం ఇవ్వాలని కోరుతున్నారు కూడా. రాష్ట్రవ్యాప్తంగా ఇటువంటి సమస్యలే ఉన్నాయి.

ఇక ప్రభుత్వ పాఠశాలల విషయానికి వస్తే భోజనం మెనూలో సోమ, బుధవారాల్లో బిర్యానీ, కుర్మా అందిస్తుండగా, మంగళవారం పులిహోరా, టమాటా చట్నీ, గురువారం పులిహోరా, చట్నీ, శుక్రవారం పాలకూర పప్పు, అన్నం, శనివారం అన్నం, పప్పు, కుర్మా, స్వీట్ పొంగల్ అందిస్తున్నారు. అయితే సోమ, బుధవారాల్లో అందించే బిర్యానీ అస్సలు రుచి లేదని, చప్పగా ఉంటోందని, అందులో దుంపలు ఉడకడమేలేదని, కుర్మా కారంగా ఉంటోందని విద్యార్థులు వాపోతున్నారు. మంగళవారం, గురువారం అందించే పులిహోర, చట్నీ ఫర్వాలేదని, అయితే శుక్ర, శనివారాల్లో పెడుతున్న అన్నం నీరు పట్టినట్టు జారుతోందని విద్యార్థులు చెబుతున్నారు. ఇంక రోజూ ఇచ్చే గుడ్లు ఉడకడంలేదని వాపోతున్నారు. ఇంటి నుంచి క్యారేజీ తీసుకువెళ్దామంటే స్కూల్ భోజనం తాము తినగా లేనిది మీరు తినలేరా అని టీచర్లు కోప్పడుతున్నారని విద్యార్థులు తెలిపారు. విద్యార్థినీ విద్యార్థులు ఇంటి నుంచి వచ్చేటప్పుడు, స్కూల్ భోజనం సమయంలో పచ్చడిప్యాకెట్లు కొనుక్కుని తెచ్చుకోవడం కనిపిస్తుంది. ఇక నెల నెల ఆడపిల్లలకు ఇచ్చే

## విద్యార్థులు 'డొక్క'లు మాడ్చుకుంటున్నారు

నాఫ్కిన్స్ నాలుగు నెలలుగా ఇవ్వడంలేదని విద్యార్థినులు చెబుతున్నారు. ఉడికీ ఉడకని భోజనం సగం తిని వదిలేద్దామంటే ఎన్జీసీ లీడర్లంటూ కొందర్ని స్కూల్ హెచ్‌ఎంలు నియమించడంతో వారు ఎక్కడ ఫిర్యాదు చేస్తారోనని విద్యార్థులు భయపడిపోతున్నారు. లాభం లేదనుకుని భోజనం తినే ప్లేట్లకు బదులు కొద్దిగా అన్నం పట్టే టిఫిన్ ప్లేట్లు పట్టుకెళ్లి భోజనం అయిందనిపిస్తున్నారు. సాయంత్రం స్కూల్ విడిచిపెట్టిన సమయంలో ఇంటికి వచ్చి ఆకలికి తట్టుకోలేక ఏది ఉంటే దానితో సరిపెట్టుకుని, నీళ్లు వేసుకొని అన్నం తింటున్న సందర్భాలు ఉన్నాయి. దీనిపై కలెక్టర్, జిల్లా విద్యాశాఖాధికారి స్పందించి డొక్కా సీతమ్మ పేరిట అక్షయపాత్ర అందిస్తున్న మధ్యాహ్న భోజనాలను తనిఖీ చేయాలని, తమకు రుచికరంగా కాకపోయినా, తినగలిగేలా ఉండే భోజనాలు పెట్టే ఏర్పాటు చేయాలని, లేదా తమ ఇళ్ల నుంచి క్యారేజీలు తెచ్చుకునేందుకు అనుమతించాలని విద్యార్థులు కోరుతున్నారు.

- సోమ, బుధవారం బిర్యానీ చప్పగా ఉంటోంది
- దుంపలు ఉడకడమే లేదు
- బంగాళాదుంప కుర్మా కారం
- అన్నం జావకారుతోంది
- స్కూళ్లకు క్యారేజీ తీసుకురానీరు
- పచ్చడి ప్యాకెట్లు ఆశ్రయిస్తున్న వైనం
- ఇంటర్వెల్‌కు ఇచ్చే గుడ్లు ఉడకడమేలేదు
- ఇంటికి వచ్చి గంజన్నాన్ని పరమాన్నంగా తింటున్నారు
- నాఫ్కిన్స్ ఇచ్చి నాలుగు నెలలయ్యింది



• ఎడిటోరియల్

# ధర్మహింస తద్దైవచ..!

'దశావతారం' సినిమా చూశారా? చోళరాజు కుళోత్తుంగ చోలన్ శైవమతవ్యాప్తి కోసం వైష్ణవ మతస్తుడైన రామానుజ నంబిని హింసించే సన్నివేశం చూసే ఉంటారు. హీరో కమల్‌హాసన్‌కో, దర్శకుడు కె.ఎస్.రవికుమార్‌కో ఉబుసుపోక పెట్టిన సన్నివేశం కాదది. ఒకానొక సమయంలో నిజంగానే జరిగిన ఉదంతాలవి. ఆ ఒక్కచోటే కాదు, అలా చాలాచోట్ల.. ప్రపంచంలో చాలా మతాలు ఇతర మతాలపై ఆధిపత్యం కోసం యుద్ధాలు చేశాయి. ఒకే మతంలోని రెండు శాఖల మధ్య కూడా ఆ వైరం నడిచింది. 'శివ' నామాన్ని పలకడం పాపం అని వైష్ణవులు, 'వైష్ణవ' నామం పలకడం దోషం అని శైవులు భావించిన కాలాలున్నాయి. ఏవీ సాక్ష్యాలు? ఎక్కడా అంటే, టైం మిషన్ ఎక్కించి ఆ కాలానికి తీసుకెళ్లలేం కానీ, 'మేం శివుణ్ని గౌరవిస్తాం కానీ, పూజించం' అని చినజీయర్ స్వామి చెప్పిన మాటలు దీనికి తార్కాణం. మతాలన్నీ శాంతియుతంగా ఉంటాయనుకోవడం మన అమాయకత్వం. హింస కూడా మతంలో ఒక భాగమైపోయింది. (మతంలో హింస ఉంటుందనేది చెప్పేందుకు మాత్రమే ఈ సినిమా ఉదాహరణ) ఇప్పుడు చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధానార్చకుడు రంగరాజన్ పైనా, ఆయన కుమారుడిపైనా దాడి జరిగింది. ఎందుకు? శ్రీరాముడు పుట్టిన ఇక్ష్వాకు వంశస్తుడినని చెప్పుకునే 'రామరాజ్యం' ఫౌండేషన్‌కు చెందిన వీరరాఘవరెడ్డి తన 20 మంది అనుచరులతో కలిసి రంగరాజన్ ఇంటికి వచ్చాడు. 'రామరాజ్య స్థాపన'కు ఆర్థికంగా మద్దతు ఇవ్వాలని కోరాడు. వాళ్ల వాలకం నచ్చలేదో, వాళ్ల ప్రతిపాదన నచ్చలేదో కానీ, దానికి రంగరాజన్ అంగీకరించలేదు. చెప్పింది వినకపోతే ఈ ప్రపంచంలో చాలా మతావలంబికులు చేసిందే ఆ రామరాజ్యం వాళ్లూ చేశారు. రంగరాజన్‌ను కొట్టారు. తన్నారు. బెదిరించారు. అడ్డొచ్చిన ఆయన కొడుకునూ కొట్టారు. విషయం పోలీసుల దాకా వెళ్లడంతో వాళ్లు వీరరాఘవరెడ్డిని అరెస్టు చేశారు. మిగిలినవారి కోసం గాలిస్తున్నారు. 'రామరాజ్య స్థాపకులు' ఇప్పుడు ఊళ్లు పట్టుకుని, తప్పించుకుని తిరుగుతున్నారు. రామరాజ్యం, పరలోక రాజ్యం, మతరాజ్యం, దైవరాజ్యం.. ఏదైనా ఇంతే! బలవంతంగా, బెదిరించి, భయపెట్టి, ఇబ్బందిపెట్టి, కొట్టి తెచ్చేదే తప్ప అందులో శాంతి అంటూ ఏమీ ఉండదు. 'మతం' కేంద్రంగా జరిగే పనిలో మనం మంచి వెతకాల్సిందే.. తప్ప, అందులో ఏ మంచీ ఉండదు. అన్నదానాలు, రక్తదానాలు అంటూ చెప్పుకునే పనులను అనేక స్వచ్ఛంద సంస్థలు మతప్రస్తావన లేకుండానే చేస్తున్నాయి. మతధోరణి ఎప్పటికైనా ఆధిపత్యమే! ఇక్కడా అదే జరిగింది. తాము చెప్పింది వినకపోతే, తమకు అనుకూలంగా ఉండకపోతే హింసించి మరీ దారికి తెచ్చుకోవాలని చూశారు. అలా చేసేదాన్ని 'మతం' అనొచ్చు, 'ఉన్మాదం' అని కూడా అనొచ్చు. జరిగిన దాడి పట్ల నాకు తీవ్ర వ్యతిరేకత ఉంది. ఇలాంటివి జరగకూడదన్న నిశ్చయం ఉంది. కానీ నాకు ఈ ఘటనను ఖండించాలని అనిపించడం లేదు. ఎందుకంటే ఈ ఘటన జరిగిన రెండు రోజుల తర్వాత కానీ విషయం బయటకు రాలేదు. పైగా 'నాపై 20 మంది దాడి చేశారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశాం. మిగతా వివరాలు విచారణలో తెలుస్తాయి. ఇంతకు మించి దీనిపై మాట్లాడను' అని ఆయన అంటున్నారు. ఇవన్నీ చూస్తే, రేపు 'ఇదంతా ఏమీ జరగలేదు. అంతా మార్ఫింగ్ వీడియోలు' అనే వాదన ఒకటి తెరపైకి రావొచ్చు. లేదా మతాధిపతులంతా కలిసి ఒత్తిడి తెచ్చి మరీ ఆయన చేత అనిపించొచ్చు. లేదా మేమూ మేమూ ఒకటే, మాది ఒకటే మతం, మరి ఈ కేసులెందుకు అనే మతసౌభ్రాతృత్వ ధోరణి ప్రదర్శించవచ్చు. ఇప్పుడు ఈ దాడిని ఖండించి, ఆఖర్లో అప్పుడు వెర్రిపుష్పం అవ్వడం ఇష్టం లేదు.. ఆరోపణలు చేయడం లేదు.. జరుగుతున్న విషయాలను విశ్లేషించి చూసుకుంటున్నాను. కానీ.. దాడి జరిగాక పోలీసులే ఎందుకు స్పందించారనేది అర్థం కావడం లేదు. అర్చకుడికి ఏదైనా జరిగితే దేవుడు స్పందించొద్దా? మన కష్టాలన్నీ భగవంతుడు తీరుస్తాడని చెప్పే అర్చకుడు తన మీద జరిగిన దాడికి మాత్రం పోలీసుల దగ్గరికి వెళ్లడమేంటి? పోలీసులు నిందితుల్ని పట్టుకోవడమేంటి? ఆయన మీద దెబ్బ పడగానే అక్కడ ఆ దైవం ప్రత్యక్షం కావాలిగా? దుష్టుల్ని సంహరించాలిగా? మన అనారోగ్యం పోగొడతామనే పాస్టర్లు, వాళ్లకు జబ్బులొస్తే ఆసుపత్రుల్లో చేరడమేంటి? దేవుడు మాలాంటి వారికోసం రాడు సరే, ఎల్లప్పుడూ దైవసేవలో ఉండేవారి కోసం కూడా రాడా? ఏంటో మరి? అన్నట్లు, 'ఇదంతా ఇతర మతాల కుట్ర, వీరరాఘవరెడ్డి అసలు పేరు వేరే, అతను వేరే మతంవాడు, అలా వేషం వేసుకొని వచ్చాడు. వారి వెంట ఉన్నవారంతా ఆ మతాలకు చెందినవారే!' అని ఇంకా ఎవరూ ప్రచారం మొదలుపెట్టలేదా? పెడతారేమో? లేక ఈ దాడిని సమర్థించే కథలు రాస్తున్నారేమో? చూడాలి.

## మహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్న సూర

(సత్యంన్యూస్, రణస్థలం)

జిల్లాలోని కమ్మసిగడాంలో జరుగుతున్న జాతర సందర్భంగా మహాలక్ష్మి అమ్మవారిని ప్రముఖ వ్యాపారవేత్త డాక్టర్ సూర శ్రీనివాసరావు ఆదివారం దర్శించుకున్నారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్ర కల్పవల్లిగా వెలసిన మహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకునేందుకు శ్రీకాకుళంతో పాటు విశాఖపట్నం, విజయనగరం ఒడిశా, ప్రాంతాల నుంచి కూడా ప్రజలు ఎక్కువగా వస్తారని తెలిపారు. ఈజాతరను మూడురోజుల పాటు నిర్వహిస్తారు. పందిరిరాటను ఈ జాతరలో కీలక ఘట్టంగా భావిస్తారని తెలిపారు. ఈ జాతరలో తాళిబొట్టు, పసుపు కుంకుమను ఊరేగింపుగా తీసుకొస్తారని వివరించారు. ప్రతి ఏటా ఫిబ్రవరి నెలలో ఈ పండుగ నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తుందని సుదూర ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకుని పూజ కార్యక్రమాలు చేస్తుంటారని చెప్పారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు డాక్టర్ సూర శ్రీనివాసరావును శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.



## ఎంపీకి "మా దేవుడు మీరే మాస్టారు" పుస్తక బహుకరణ

(సత్యంన్యూస్, పొందూరు)



విజయనగరం లోకసభ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడుకు "మా దేవుడు మీరే మాస్టారు" అనే పుస్తకాన్ని మండలం బురిడికంచరాంకు చెందిన రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మెండ తవుడు, ప్రభ దంపతులు బహుకరించారు. విశాఖపట్నం ఆర్.కె.బీచ్ లోని ఓ ప్రముఖ ఫంక్షన్‌హాలులో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఈ పుస్తకాన్ని అందజేశారు. ఎంపీ అప్పల నాయుడును వారు సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ దేవుడు మాస్టారు నిబద్ధత కలిగిన ఉపాధ్యా యులని, గొప్ప దాత అని అక్కడికి విచ్చేసిన అసెంబ్లీ స్పీకర్ సి.హెచ్.అయ్యన్నపాత్రుడు, మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావులకు పరిచయం చేస్తూ పేర్కొ న్నారు. తవుడు మాస్టారు గతంలో ఉద్యోగ విరమణ చేసిన సందర్భంగా ఆయన ఆదర్శాలను వివరిస్తూ నామ విజ్ఞాన వేత్త వాండ్రంగి కొండలరావు, నెయ్యిల ఉమామహేశ్వరరావు ఈ పుస్తకాన్ని రాసిన సంగతి తెలిసిందే.

## కుంభమేళా స్పెషల్

## ఆర్టీసీ బస్సులకు అనూహ్య స్పందన

**- ఈనెల 16న అదనంగా మరో బస్సు ఏర్పాటు**

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళం నుండి మహా కుంభమేళాలో పుణ్యస్నానాలకు (ప్రయాగరాజ్) వెళ్లే వారి కోసం ఆర్టీసీ శ్రీకాకుళం 1వ డిపో అధికారులు ఈనెల 8వ తేదీన ఏర్పాటు చేసిన స్పెషల్ సూపర్ లగ్జరీ (2+2) పుష్‌బ్యాక్ బస్సుకు ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించిందని జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. ఈమేరకు సోమవారం ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. విశేష స్పందన మేరకు ఈనెల 12వ తేదీ నాడు రెండవ కుంభమేళ యాత్రా స్పెషల్ బస్సును ఏర్పాటు చేశామన్నారు. ఈ ప్రత్యేక బస్సులో కూడా ప్రయాణికుల టిక్కెట్ బుకింగ్స్ ఫుల్ అయిపోయాయన్నారు. ప్రజల నుంచి వస్తున్న అనూహ్యస్పందనకు అనుగుణంగా ఈనెల 16న మరో ప్రత్యేక సర్వీసును మహా కుంభమేళాకు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 16న శ్రీకాకుళం బస్ స్టేషన్ నుండి రాత్రి 8గంటలకు బస్సు బయల్దేరుతుందన్నారు. మొత్తం 7రోజుల్లో మొదటిరోజు రాత్రి శ్రీకాకుళంలో బయల్దేరి రెండోరోజు ఉదయానికి పూరి చేరుకుంటుందన్నారు. పూరీలో జగన్నాథస్వామి వారి దర్శనం, కోణార్క్, సాయంత్రం భువనేశ్వర్‌లో గల లింగరాజ్ ఆలయం దర్శించుకున్న పిదప నేరుగా మూడవరోజు సాయంత్రానికి ప్రయాగ్ రాజ్ చేరుకుంటుందన్నారు. నాల్గవరోజు ప్రయాగ్‌రాజ్ త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించిన పిదప రాత్రి బయలుదేరి ఐదవ రోజు ఉదయానికి వారణాశి చేరుకుంటుందన్నారు. కాశీ విశ్వేశ్వరుడిని దర్శించిన పిదప, ఆరవరోజు ఉదయం వారణాశి నుంచి బయలుదేరి గయ, బుద్ధ గయ క్షేత్రాల దర్శనానంతరం ఏడవరోజు రాత్రికి శ్రీకాకుళం చేరుకుంటుందన్నారు. ఈ సర్వీస్‌కు ముందస్తు రిజర్వేషన్ సౌకర్యం కల్పించామన్నారు. ఈ సదావకాశాన్ని శ్రీకాకుళం జిల్లా, పరిసరప్రాంత ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. 10 కిలో మీటర్ల లోపున 35మంది ప్రయాణికులు ఒకే చోటు నుంచి బయల్దేరితే బస్సు వారు కోరిన ప్రదేశానికి పంపుతామన్నారు. మనిషి ఒక్కంటికి టికెట్ ధర రూ.9,500లుగా నిర్ణయించామన్నారు. యాత్రా సమయంలో యాత్రికులకు మధ్యాహ్నం భోజనం, ఉదయం, రాత్రి అల్పాహారం ఏర్పాటు చేయబడిందన్నారు. ఇతర ఖర్చులు, వసతి ఖర్చులు యాత్రికులు ఎవరి ఖర్చులు వారే భరించాల్సి ఉంటుందన్నారు. పవిత్ర త్రివేణి సంగమంలో స్నానమాచరించి, శుద్ధిని, మోక్షాన్ని పొందేందుకు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 9959225608, 9959235609, 9959225610, 9959225611, 7382917289, 7382921647, 7382923311, 7382924758 నెంబర్లను సంప్రదించాలన్నారు.

# ఉద్యోగులకు పీఆర్సీ ఎప్పుడు?

**- ఎస్టీయు జిల్లా అధ్యక్షులు ఎస్వీ రమణమూర్తి**



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రాష్ట్రంలో లక్షలాదిమంది ఉపాధ్యాయులు, ఉద్యోగులు పీఆర్సీ కోసం కూటమి ప్రభుత్వం మీద నమ్మకంతో కోటి ఆశలతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారని 11వ వేతన సవరణ గడువు 2023 జూలై నాటికే ముగిసిందని గడువు ముగిసి 20 నెలలు గడుస్తున్నా ఇంకా కూటమి ప్రభుత్వం కరుణించడం లేదని ఎస్టీయు జిల్లా అధ్యక్షులు ఎస్వీ రమణ మూర్తి అన్నారు. స్థానిక దాసరి క్రాంతిభవన్‌లో ఎస్టీయు జిల్లా కార్యవర్గ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధానకార్యదర్శి జి.రమణ మాట్లాడుతూ ఈ రాష్ట్రంలో గతవేతన సవరణ ముగిసి 20నెలలు గడుస్తున్నా కనీసం వేతన సవరణ చైర్మన్ నియామకమే లేదన్నారు. ఎన్నికల ముందు ఉద్యోగులకు అన్ని ప్రయోజనాలు సకాలంలో నెరవేర్చుతామని హామీనిచ్చి నేడు అధికారంలోకి వచ్చాక ఉద్యోగులతో కనీసం సమావేశమై నిర్వహించలేదని విమర్శించారు. ఉద్యోగులకు రావలసిన బకాయిలపై ఒక్కమాట కూడా మాట్లాడకపోవడం శోచనీయమన్నారు. ప్రభుత్వం ఉద్యోగులు ప్రయోజనాలకు గండి కొడుతూ ఉద్యోగులను భారంగా భావించడం పాలకపక్షానికి తగదని, ఇప్పటికైనా పెండింగ్ బకాయిలపై ప్రకటన చేసి వెంటనే ఐఆర్ ప్రకటించి 12వ వేతన సవరణకు మార్గం సుగమమం చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు పి.రామకృష్ణ బి.సత్యం, కె.శ్రీనివాసరావు, కె.తేజేశ్వరరావు, ఎన్.లక్ష్మణరావు, జి.శ్రీనివాసరావు, రాజు, కె.కరుణకుమార్, డీవీఎన్ పట్నాయక్, పలు మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

**చావా.. ఈ వారం రిలీజ్ కాబోయే హిందీ సినిమా మీద విపరీతమైన ప్రచారం సాగుతోంది. బజ్ క్రియేటవుతోంది. చాన్నాళ్లుగా అసలు హిందీ సినిమా పట్టుమని పది రోజులు థియేటర్లలో ఆడిందే లేదు కదా.. దీని మీద మాత్రం కాస్త ఆసక్తి నిర్మితమవుతోంది. కారణం.. అది ఛత్రపతి శంభాజీ మహారాజ్ మీద తీస్తున్న సినిమా.. తను మరాఠా చక్రవర్తి. శివాజీ కొడుకు. సో, హిందీ బెల్టులో ఆదరణను ఆశిస్తోంది సినిమా టీం.. శివాజీ సావంత్ రాసిన ఛావా అనే నవల ఆధారంగా సినిమా కథను రాసుకున్నారు. లక్ష్మణ్ ఉటేకర్ దీనికి దర్శకుడు. హిందీ, మరాఠీ సినిమాలు తీశాడు, సినిమాటోగ్రాఫర్ కూడా.. పెద్ద సూపర్ హిట్ సినిమాలు ఏమీ లేవు కానీ ఆకర్షిస్తున్నది విక్కీ కౌశల్ శంభాజీ పాత్ర పోషించడం, నేషనల్ క్రష్‌గా బాగా పాపులర్ అయిపోయిన రష్మిక మంధాన కథానాయిక.**




## ఛత్రపతి శివాజీ వారసుడు..

# శంభాజీ కథతో సినిమా!

ఏఆర్ రెహమాన్ సంగీతం, తను స్వయంగా ఓ పాట పాడాడు కూడా.. ఇలా దీనిపై ఆసక్తి ఏర్పడుతోంది. విక్కీ కౌశల్ గ్యాంగ్స్ ఆఫ్ వాసేపూర్‌తో వెలుగులోకి వచ్చినా తనకు ఉరి, రాజీ, సర్దార్ ఉధమ్ తదితర చిత్రాలు మంచి పేరు తెచ్చాయి. ఇక శామ్ బహదూర్ సినిమాలో ఆ పాత్రలోకి దూరిపోయాడు అక్షరాలా.. దాంతో అభిమానులను పెంచుకున్నాడు. శంభాజీ పాత్రకు కొన్ని నెగెటివ్ షేడ్స్ ఉంటాయి. తండ్రే తనను భరించలేక ఓ కోటలో బందీగా ఉంచుతాడు కొన్నాళ్లు.. శివాజీ మరణం తరువాత సింహాసనం కోసం వారసత్వ కుట్రలు.. ఆరేడేళ్లు మాత్రమే తన అధికారం.. ఔరంగజేబు శంభాజీని మతం మార్చుకవాలని కోరితే, నీ కుమార్తెను నాకిచ్చినా సరే అంగీకరించను అని నిరాకరించాడనీ, అందుకే ఔరంగజేబు తనను ఉరితీయించాడని మరాఠీ కథనాలు.. కానీ తన పాలనలో ముస్లింలపై శంభాజీ బలగాలు సాగించిన దాడు లు, దోపిడీలు, హత్యలు, అవమానాలకు శిక్షగా తనను ఔరంగజేబు ఉరితీయించాడని మరికొన్ని కథనాలు.. వాటిల్లో ఈ దర్శకుడు ఏ వెర్షన్ తీసుకుని ఎలా ప్రజెంట్ చేశాడనేది ఇంట్రస్టిం గు పాయింట్..!! స్వధర్మా నికి కట్టుబడి మరణశిక్షను ధైర్యంగా ఆహ్వానించిన ధీరుడిగానా..? ఔరంగజేబుతో ఓడిపోయి తనువు చాలించిన ఓ సైనికుడిగానా..? అప్పటి ఓ సగటు హిందూ రాజుగానా..?!



అక్షయ్‌ఖన్నా ఔరంగజేబు పాత్ర చేశాడు. రష్మిక సరేసరి.. పుష్ప, యానిమల్ సినిమాలతో ఎక్కడికో వెళ్లిపోయింది. సరే, నటీనటులు బాగా కుదిరితే సినిమా హిట్ కావాలని ఏమీ లేదు కానీ.. ఈ కథ కొంచెం ఇంట్రస్టింగు. అందరికీ శివాజీ కథ తెలుసు.. తన మీద బోలెడు సాహిత్యం, నాటకాలు, కళారూపాలు. కానీ తన కొడుకు శంభాజీ కథ దేశంలోని ఇతర ప్రాంతాల్లోని చాలామందికి తెలియదు.ఆ ఫ్యాక్టరే ఈ సినిమాను జనానికి చేరువ చేస్తుందని అంటున్నాడు దర్శకుడు లక్ష్మణ్ ఉటేకర్.. ట్రెయిలర్లు, ఫస్ట్ లుక్కులు గట్రా ఇప్పటికే బాగా వైరలయ్యాయి కూడా.. శంభాజీ మీద గతంలో కూడా కొన్ని సినిమాలు వచ్చాయి. క్లిష్టమైన కథ ఇది.. శంభాజీ మీద భిన్నమైన కథనాలు ఉన్నాయి.


- ముచ్చట సౌజన్యంతో...

బాలీవుడ్ నుంచి టాలీవుడ్‌కి జాన్వీ కపూర్ ప్రయాణం గురించి తెలిసినదే. జాన్వీ సౌత్‌లోను వేవ్స్ క్రియేట్ చేస్తోంది. కెరీర్ ఆరంభమే టాలీవుడ్‌లో యంగ్ టైగర్ ఎన్టీఆర్ సరసన నటించే అవకాశం అందుకుంది. దేవర లాంటి పాన్ ఇండియా బ్లాక్ బస్టర్‌తో ఘనమైన ఎంట్రీ ఇచ్చింది. ఇప్పుడు మగధీర రామ్ చరణ్ సరసన క్రేజీగా స్పోర్ట్స్ బ్యాక్ డ్రాప్ మూవీలో నటిస్తోంది. ఈ సినిమాలో తనకు నటిగా నిరూపించుకునే ఆస్కారం బుచ్చిబాబు కల్పించాడని టాక్ వినిపిస్తోంది. షూటింగుల కోసం జాన్వీ హైదరాబాద్ కి వచ్చి వెళుతోంది. ఇటీవల ముంబై టు హైదరాబాద్ ప్రయాణాలతో బిజీ బిజీగా ఉంది. మరోవైపు జాన్వీకపూర్ నిరంతర ఫోటో షూట్లు వెబ్ లో వైరల్‌గా మారుతున్నాయి. యూత్ జాన్వీ ఫోటోలను వాట్సాప్‌లో వైరల్‌గా షేర్ చేస్తున్నారు. ఇటీవల జాన్వీ స్పెషల్ లుక్ ఒకటి అంతర్జాలంలో వేవ్స్ క్రియేట్ చేస్తోంది. చూడగానే మత్స్యకన్య రూపంతో హృదయాలను టచ్ చేస్తోందని ఫ్యాన్స్ పొగిడేస్తున్నారు. ఎంపిక చేసుకున్న సిల్వర్ లైనింగ్ మెటాలిక్ దుస్తుల్లో జాన్వీ ఎంతో అందంగా కనిపిస్తోంది. ఫోటోషూట్ ఆద్యంతం మత్తు కళ్లతో కవ్విస్తోందని పొగిడేస్తున్నారు బోయ్స్. ఈ స్పెషల్ ఫోటోషూట్ ని ఇన్‌స్టాలో షేర్ చేసిన జాన్వీ కపూర్ దానికి అందమైన క్యాప్షన్ ని ఇచ్చింది. "నేను ఈ విక్టోరియన్ దేశీని ఆకతాయి అమ్మాయితో సమ్మర్" అని పిలుస్తాను.. అంటూ క్యాప్షన్ జోడించింది. ఒక అభిమాని జూ. అతిలోక సుందరి సమ్మోహనంలో ముంచేస్తోంది! అంటూ వ్యాఖ్యను జోడించాడు.



# జాన్వీ..సుందరి సమ్మోహనం

- తుపాకి.కామ్ సౌజన్యంతో..



**ఆమ్ ఆద్మీ పార్టీ సుదీర్ఘ పాలనకి తెరపడింది. 1998లో ఢిల్లీలో అధికారం కోల్పోయిన బీజేపీ కి 28 ఏళ్ళ తరువాత అధికారం దక్కింది. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలలో ఆమ్ ఆద్మీ పార్టీ ఓటమికి విశ్లేషకులు ఎన్ని రకాల కారణాలు చెప్పినా మొదటి ప్రధాన కారణం ని మాత్రం గుర్తించలేకపోయారు. ఢిల్లీలో గత 12ఏళ్లుగా అక్రమంగా ఉంటున్న బాంగ్లాదేశ్, మియాన్మార్ రోహింగ్యాలు వేసిన ఓట్లతోనే కేజ్రీవాల్ గెలుస్తూ వచ్చాడు అన్నది సత్యం. కేజ్రీవాల్ అధికారంలో ఉన్నంత వరకూ తమని ఎవ్వరూ ఏమీ చేయలేరు అనే ధీమా ఉండేదివాళ్లకి. కానీ ట్రంప్ ఎప్పుడైతే అమెరికాలో ఉంటున్న అక్రమవలసదారులని వెనక్కి పంపిస్తాను అని చెప్పడమే కాదు చేసి చూపించడం మొదలుపెట్టాడో భారత్‌లో ముఖ్యంగా ఢిల్లీ చుట్టుపక్కల ఉంటున్న కేజ్రీవాల్ ఓటు బ్యాంక్‌లో భయం మొదలయ్యింది! ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తి తమని కాపాడలేడు అని తెలుసుకొని బీజేపీకి ఓటు వేశారు!**

# ఢిల్లీ అసెంబ్లీ ఫలితాలు.. డోనాల్డ్ ట్రంప్‌కు ధన్యవాదాలు!!

అయితే ఈ చర్య వల్ల వాళ్ళని దేశం నుండి బీజేపీ పంపించదు అని కాదు కానీ కనీసం బేరం ఆడడానికి పనికి వస్తుందనే ఆశ.. "ప్రపంచంలో ఎక్కడ ఏది జరిగినా, జరగబోతున్నా అది ఇమామ్‌లకి తెలిసిపోతుంది! వాళ్లు ఏ దేశంలో ఉంటున్నా వాట్సాప్ ద్వారా సందేశం వస్తుంది"

కేజ్రీవాల్ ఓటమికి యమునా నది కాలుష్యం, శీష్ మహల్, లిక్కర్ స్కామ్‌లు చిన్న కారణాలు. అక్రమ వలస దారుల భయం అనేది కేజ్రీవాల్ ఓటమికి దారి తీసింది! పోలింగ్ సరళి, గెలిచిన వారి ఓట్లు, ఓడిపోయిన వారి ఓట్లని పరిశీలిస్తే భారీ మెజారిటీలు నమోదు కాలేదు. మీ దగ్గర గోధుమలు కిలో ఎంత? మా దగ్గర ఇంత. తిరిగి స్వదేశానికి వెళ్ళాల్సి వస్తే అది ఆత్మహత్యతో సమానం అనే భయం మొదటిసారిగా అక్రమ వలస దారులలో వచ్చింది కాబట్టే బీజేపీకి ఓటు వేశారు. బెయిల్ మీద ఉన్న కేజ్రీవాల్ ఎప్పుడైనా తిరిగి జైలుకెళతారు అనే విషయం అక్రమ వలసదారులకి తెలుసు!

ఆల్ ఇండియా ఇమామ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సాజీద్ రషీది బహిరంగంగానే నేను బీజేపీకి ఓటు వేశాను అని రెండు రోజుల క్రితం ప్రకటించినప్పుడే కేజ్రీవాల్ ఓటమి ఖాయం అయిపోయింది!

సాజీద్ రషీది మాటల్లో.. అన్ని రాజకీయ పార్టీలు ముస్లిమ్స్‌ని ఓటుబ్యాంక్‌గా వాడుకుంటున్నాయి తప్పితే చేసింది ఏమీ లేదు! అందుకే నేను బీజేపీకి ఓటు వేశాను.

రేపొద్దున బీజేపీ ప్రభుత్వం ఏర్పడితే అక్రమ వలస దారుల ఏరివేత మొదలయితే ఇదే సాజీద్ రషీది మధ్య వర్తిత్వం చేయడానికి అక్రమ వలస దారుల చేత ఓట్లు వేయించాడు! ఏర్పడితే కాదు కానీ రెండు రోజుల్లో బీజేపీ ప్రభుత్వం ఏర్పడబోతున్నది!

### బీజేపీ స్ట్రాటజీ!

లిక్కర్ స్కామ్‌లో అరెస్ట్ చేయడం అనేది కేజ్రీ వాల్ ఓటమికి పెద్దగా ఉపయోగపడదు. కానీ అక్రమ వలస దారుల ఓట్లు కేజ్రీ వాల్‌ని గెలిపిస్తాయి. గత డిసెంబర్ నెలలో ఢిల్లీ పోలీసులు కార్డన్‌సెర్చ్ పేరుతో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఆ స్పెషల్ డ్రైవ్‌లో ఒక్క రోజులోనే వెయ్యికి పైగా బాంగ్లాదేశ్ నుండి వచ్చి అక్రమంగా ఆధార్, రేషన్ కార్డులు తీసుకొని ఉంటున్న వారు బయటపడ్డారు! ఈ విషయం పెద్దగా ప్రచారానికి నోచుకోలేదు కానీ ప్రభావం బాగానే చూపించింది! అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే వరకూ స్పెషల్ డ్రైవ్ జరిగింది! అంతిమంగా ఎంత మంది అక్రమ వలస దార్లని గుర్తించారు అనే లెక్కలు బయటపెట్టలేదు ఢిల్లీ పోలీసులు కానీ ఎంత మంది ఉన్నారో సాజీద్ రషీదాకి తెలుసు. స్పెషల్ డ్రైవ్ పనిచేసింది!

### అంతర్జాతీయ సహాయం అందలేదు!

గత రెండు అసెంబ్లీ ఎన్నికలలో జార్జ్ సోరోస్ నుండి కావాల్సినంత డబ్బు ముట్టింది కేజ్రీ వాల్‌కి.. మనీ లాండరింగ్ కేసులో కేజ్రీవాల్ అరెస్ట్ అవ్వగానే జార్జ్ సోరోస్ కేజ్రీవాల్‌ని పక్కన పెట్టేసాడు! జార్జ్ సోరోస్ ఒకవైపు ఎలాన్ మస్క్ నుండి ఒత్తిడిని ఎదుర్కొంటున్నాడు మరో వైపు పుతిన్ హిట్ లిస్ట్‌లో ఉండడం వలన కేజ్రీవాల్‌కి సపోర్ట్ లేకుండా పోయింది. మరోవైపు ఖలీస్తాన్ గ్యాంగ్ నుండి డబ్బులు రాకపోగా బండారం బయటపెడతామనే బెదిరింపులు రావడం కేజ్రీవాల్ ఆత్మస్థైర్యాన్ని దెబ్బ తీసింది. ఢిల్లీ ఎన్నికల ప్రచారంలో కేజ్రీ వాల్ బాడీ లాంగ్వేజ్ ఓటమి తప్పదనే సాంకేతాలు కనిపించాయి.

### ఎన్నికలలో గెలుపు ఓటములు సహజం!

గెలవగానే పిచ్చి వ్యాఖ్యలు చేయకుండా హుందాగా ఉండాలి. కేజ్రీవాల్ బీజేపీతో పాటు కాంగ్రెస్ ని కూడా ఎదుర్కోవాల్సి రావడం రాజకీయ తప్పిదం.

**ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు:**
**బీజేపీ- 48, ఆప్-22, కాంగ్రెస్ -00..**

బీజేపీకి అతి పెద్ద విజయం ఇది. కేజ్రీ వాల్, మనీష్ సిసోడియా లు ఓడిపోవడమే విచిత్రం. కాంగ్రెస్‌ని దూరం పెట్టడం వలన ఆప్ ఓడిపోయింది అనడానికి ఆధారాలు లేవు. కేజ్రీవాల్ రెండు సార్లు గెలిచిన న్యూ ఢిల్లీ నియోజకవర్గంలో (మునుపు గోలే మార్కెట్‌గా ఉండేది కానీ నియోజక వర్గ పునర్విభజన తరువాత న్యూ ఢిల్లీ అయింది).

### ఈసారి ఓడిపోవడం మాత్రం కాంగ్రెస్ వల్లనే

బీజేపీ నుండి పర్వేష్ సాహిబ్ సింగ్ పోటీ చేయగా, ఆప్ నుండి కేజ్రీవాల్, కాంగ్రెస్ నుండి సందీప్ దీక్షిత్ పోటీ చేశారు. కాంగ్రెస్ అభ్యర్థి సందీప్ దీక్షిత్ కేవలం కేజ్రీ వాల్ ఓటమి కోసమే పని చేశాడు తప్పితే తాను గెలవాలి అని కాదు. బీజేపీ అభ్యర్థి పర్వేష్ సాహిబ్ సింగ్ వర్మ ఢిల్లీ మాజీ బీజేపీ ముఖ్యమంత్రి అయిన సాహిబ్ సింగ్ వర్మ కొడుకు. కాంగ్రెస్ అభ్యర్థి సందీప్ దీక్షిత్ ఢిల్లీ మాజీ కాంగ్రెస్ ముఖ్యమంత్రి షీలా దీక్షిత్ కొడుకు. కేజ్రీవాల్ షీలా దీక్షిత్ మీద ఆవిడ వయసుని కానీ, మహిళ అని కానీ చూడకుండా అనుచిత వ్యాఖ్యలు చేశాడు. ఈసారి కాంగ్రెస్‌తో పొత్తు లేకపోవడంతో సందీప్ దీక్షిత్ కేజ్రీవాల్ ఓటమి మాత్రమే లక్ష్యంగా పోటీ చేశాడు. కాంగ్రెస్ సందీప్ దీక్షిత్‌కి వచ్చిన ఓట్లు 4,568. కేజ్రీవాల్ ఓడిపోయింది 4,089 ఓట్ల తేడాతో. ప్రత్యర్థులని ఎగతాళి చేస్తే ఏమవుతుందో కేజ్రీ వాల్ ఒక లాండ్‌మార్క్‌గా ఉంటాడు ఎప్పటికి. ఈ ఎన్నికలలో కాంగ్రెస్‌కి వచ్చేది ఏదీ ఉండదు అని తెలిసే సందీప్‌దీక్షిత్ కేజ్రీ వాల్ ఓటమి లక్ష్యంగా పనిచేశాడు. షీలాదీక్షిత్ కుమార్తె అయిన లతిక కూడా కేజ్రీ వాల్ ఓటమి లక్ష్యంగా సోదరుడితో కలిసి ప్రచారం చేసింది. నేను మోనార్క్‌ని.. నన్నెవ్వరూ ఓడించలేరు. నన్ను ఓడించాలి అంటే ఇంకో జన్మ ఎత్తాలి. ప్రధాని మోడీని ఉద్దేశించి కేజ్రీ వాల్ చేసిన ఈ వీడియోని ఇప్పుడు బీజేపీ వైరల్ చేస్తుంది!

-పార్థసారధి పొట్లూరి

**భవిష్యత్ ఏమిటీ?**

**ఆప్ పార్టీ శకం ముగిసినట్లే.. ఒక వ్యక్తి మీద ఆధారపడి ఉండే ఏ పార్టీ అయినా సరే ఆ వ్యక్తి వల్లనే నాశనం అవుతుంది. సిద్ధాంతం అంటే ఉచిత పథకాలు కావు. కేజ్రీవాల్ ఒక్క ఫ్లైఓవర్ కూడా కట్టలేదు.. కేజ్రీవాల్ ఒక్క స్కూల్ కూడా కొత్తది కట్టలేదు.. కేజ్రీవాల్ ఒక్క ఆసుపత్రి కూడా కొత్తది కట్టలేదు.. ఉచిత బస్ ప్రయాణం.. ఉచిత విద్యుత్.. కానీ ఢిల్లీవాసులకి కొత్తగా ఒక్క మంచినీటి పైప్ లైన్ వేసి నీళ్లు ఇవ్వలేకపోయాడు కానీ తన ప్రమోషన్ కోసం రూ.700కోట్ల విలువ చేసే ప్రకటనలు ఇచ్చాడు పత్రికలకి, టీవి ఛానెల్స్‌కి.. ఢిల్లీ మత ఘర్షణల మీద ఢిల్లీ అసెంబ్లీ సమావేశంలో హిందువుల మరణాల మీద వెకిలి నవ్వులు నవ్విన కేజ్రీవాల్‌ని ఎవరు మరిచిపోగలరు? స్వాతీ మలీవాల్ మీద గూండాల చేత చేయించిన దాడిని ఎవరు మరిచిపోగలరు?**

## జల్ జీవన్ మిషన్ పథకం అమలులో కూటమి ప్రభుత్వం విఫలం

(సత్యంన్యూస్, పాతపట్నం)



నీటి ద్వారా వచ్చే వ్యాదులను గణనీయంగా తగ్గిస్తూ గ్రామీణ ప్రాంతాలలో నీటి ఎద్దడి సమస్యను పరిష్కరించడానికి రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాలలోని ప్రతి ఇంటికి వ్యక్తిగత గృహ కుళాయి కనెక్షన్ల ద్వారా నీటి నాణ్యత ప్రమాణాలు అనుసరిస్తూ స్వచ్ఛమైన, సురక్షితమైన తగినంత త్రాగునీరు అందజేయడానికి వైకాపా ప్రభుత్వ హయంలో జలజీవన మిషన్ పనుల ప్రారంభానికి మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి శ్రీకారం చుట్టారన్నారు. రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో మంచినీటి సమస్య ప్రజల్ని తీవ్రంగా వేధిస్తోందన్నారు. ఏటా వేసవి వచ్చిందంటే మైళ్ల దూరం నడిచి వెళ్లి నీళ్లు తెచ్చుకుంటున్న దుస్థితి మారుమూల ప్రాంతాల్లోని ప్రజలది. కలుషిత నీరు తాగి ప్రాణాలకు మీదకు తెచ్చుకుంటున్న గ్రామీణుల అవస్థలు మనసున్న ప్రతి ఒక్కరిని కన్నీళ్లు పెట్టిస్తున్నా.. కూటమి ప్రభుత్వం, చంద్రబాబుకు మాత్రం కదిలించలేకపోయాయి. ప్రజల దాహాన్ని తీర్చేందుకు ఉద్దేశించిన జలజీవన్ మిషన్ పథకాన్ని వినియోగించుకోలేని అసమర్థత కారణంగా దప్పికతో అల్లాడిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరితగతిన జల్ జీవన్ మిషన్ పనులు పూర్తి చేయాలని గ్రామీణ ప్రాంత ప్రజలు కోరుతున్నారని రెడ్డి శాంతి అన్నారు.

## దశలవారీ పోరాటాలకు సిద్ధం కావాలి


(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధ సంఘం శ్రీకాకుళం జిల్లా సమితి ఆధ్వర్యంలో సోమవారం నాడు స్థానిక నాగావళి రివర్‌వ్యూ పార్కులో జరిగినటువంటి సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాష్ట్ర ఉపాధ్యక్షుడు భజంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న అన్ని నగర పంచాయతీలు, మున్సిపాలిటీలు నగర కార్పొరేషన్లో పరిధిలో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులకు హామీలు అమలు చేయాలని గత ప్రభుత్వం అంగీకరించిన మినిట్స్‌ను తక్షణం కూటమి ప్రభుత్వం అమలు చేయాలని కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని లేని పక్షంలో దశల వారి పోరాటాలకు సిద్ధమై ప్రభుత్వ వైఫల్యాన్ని ఎండగడతామని కూటమి ప్రభుత్వం న్యాయం చేస్తాధనే నమ్మకంతోనే కార్మికులందరూ ఎన్నుకున్నారని కాబట్టి మున్సిపల్ కార్మికులందరికీ న్యాయం చేయాలని



ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ గౌరవాధ్యక్షుడు టి.తిరుపతిరావు, అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు కె.వేణుగోపాల్, కళ్యాణి, అప్పలరాజు, శానిటరీ మేస్త్రిల సంఘం అధ్యక్షుడు ముద్దాడ రామారావు మున్సిపల్ యూనియన్ నాయకులు జె. గురుమూర్తి, ఎన్. పార్థసారథి, రామచంద్ర, కిరణ్, సురేష్, సోగ్గాడు, అర్జీ గణేష్, అరుగులరమణ , కళ్యాణి తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు

ఇటీవల టెక్కలి మండల వైకాపా అధ్యక్షులుగా నియమితులైన హనుమంతు వెంకటరమణ, టెక్కలి టౌన్ అధ్యక్షులు తమన్న గారి కిరణ్‌లు నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేరాడ తిలక్‌ను సోమవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రమేష్, ఎంపీటీసీ అప్పలరెడ్డి, సర్పంచ్‌లు బాలకృష్ణ, పోలాకి మోహన్, లోకేష్ రెడ్డి, నాయకులు ఆంజనేయులు, రాజేశ్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు. – సత్యంన్యూస్, టెక్కలి



## రణస్థలం వద్ద ఫ్లై ఓవర్ నిర్మాణం ఆపండి

(సత్యంన్యూస్, రణస్థలం)

రణస్థలం మండలం జె.ఆర్.పురం వద్ద నిర్మించనున్న ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణం నిలుపుదల చేయాలని జె.ఆర్.పురం ఫ్లై ఓవర్ వ్యతిరేక కమిటీ సభ్యులు తహశీల్దార్ కార్యాలయంలోని ప్రజా ఫిర్యాదుల విభాగంలో అర్జీ అందచేశారు. తహశీల్దార్ కార్యాలయం సూపరెండెంట్ మూర్తి కి ఈ మేరకు వినతి పత్రం అందచేస్తూ ఫ్లైఓవర్ నిర్మాణం వలన ఉన్న ప్రతికూల పరిస్థితులను వివరించారు. గతంలో బైపాస్ నిర్మాణం కొరకు ప్రతిపాదించిన అధికార్లు ఆ తరువాత ఈ నిర్ణయాన్ని విరమించుకోవడాన్ని ఆక్షేపించారు. సుమారు రూ.235 కోట్లతో ఫ్లై ఓవర్ నిర్మిస్తామనడం తగదన్నారు. బైపాస్ కంటే రూ.70కోట్లు అధికంగా ఖర్చు చేసి నిర్మిస్తున్న ఫ్లైఓవర్ వలన అనర్థాలు తప్ప, ఈ ప్రాంతానికి ప్రయోజనం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఫ్లై ఓవర్ వ్యతిరేక కమిటీ సభ్యులు డిజియం ఆనందరావు, పచ్చిగుళ్ల సాయిరాం, ఇడదాసుల తిరుపతి రాజు, అల్లు యుగంధర్, పిన్నింటి సత్యంనాయుడు, చుక్క శ్రీనివాసరావులు పాల్గొన్నారు.



## పార్టీ సంస్థాగత బలోపేతానికి కృషి చేయండి



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

బీజేపీ సంస్థాగత ఎన్నికలలో ఇటీవల ఎన్నికైన మండల అధ్యక్షులు, మండలంలో పర్యటించి, పార్టీ సంస్థాగత బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు దగ్గుబాటి పురందేశ్వరి తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో బిజెపి నూతన జిల్లా అధ్యక్షులు సిరిపురం తేజేశ్వరరావు అధ్యక్షతన సోమవారం జరిగిన బీజేపీ నూతన మండల అధ్యక్షులు, జిల్లాకు చెందిన జిల్లా, రాష్ట్ర స్థాయి నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రాష్ట్ర సంఘటనా ప్రధాన కార్యదర్శి మధుకర్ మండల కమిటీలు, సంస్థాగత బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలను తెలిపారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర జోనల్ ఇన్‌ఛార్జ్ గారపాటి సీతారామాంజనేయచౌదరి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాగి కాశీవిశ్వనాధరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షులు వేటుకూరి సూర్యనారాయణ రాజు, పైడి వేణుగోపాలం, నీలాపు విజయానందరెడ్డి, అట్టాడ రవి బాబ్జి, శవ్వాన ఉమామహేశ్వరి, ఎంబిజి నాయుడు, చల్లా వెంకటేశ్వర రావు, బిర్లంగి ఉమామహేశ్వరరావు, చింతపల్లి దుర్గారావు గాంధి, సలాన రాఘవరావు, పాలవలస వైకుంఠరావు తదితరులు పాల్గొన్నారు






















## విద్యార్థులందరూ నులిపురుగుల

# మాత్రలు వేసుకోవాలి

❖ జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



(సత్యంన్యూస్, కొత్తూరు)

పిల్లలందరూ నులిపురుగుల నిర్మూలనకు మాత్రలు వేసుకోవాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పిలుపునిచ్చారు. సోమవారం మెట్టూరులోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారితో కలిసి విద్యార్థులకు నులిపురుగుల నిర్మూలనకు అల్బెండజోల్ మాత్రలు వేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ 2-19 సంవత్సరాల లోపు వయసు గల విద్యార్థులందరూ ఒక అల్బెండజోల్ మాత్ర వేసుకోవాలని, మాత్రల వలన ఏ విధమైన ఇబ్బందులు ఉండవని, ఒకవేళ ఏవైనా ఇబ్బందులు తలెత్తినా వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు. విద్యార్థులు ఎవరైనా స్కూల్‌కి రాకపోతే వారికి మాత్రలు పంపిణీ చేయాలని తెలిపారు. జిల్లాలో 4.47 లక్షల మంది పిల్లలు ఉన్నారని, అందరూ అల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలన్నారు. నులిపురుగులు సోకిన పిల్లలు, కిశోర బాలలు ప్రమాదకరమైన ఆరోగ్య సమస్యలను ఎదుర్కోకుండా అల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలని, నులిపురుగుల వల్ల రక్తహీనత, పోషకాల లోపం, ఆకలి మందగించడం, కడుపు నొప్పి, వికారం, వాంతులు, విరేచనాలు, బరువు తగ్గడం వంటివి ఉంటాయని చెప్పారు. రాబోయే రోజుల్లో ఎండలు అధికంగా ఉంటాయని, అందరూ తరచూ మంచినీరు తాగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కృష్ణమూర్తి, డీఎంహెచ్‌వో డాక్టర్ టి.వి.బాలమురళీ కృష్ణ, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ మేరి కాథరిన్, ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ వెంకట్, డీపీఎంవో వాన సురేష్, పీహెచ్‌సీ వైద్యాధికారులు, ప్రోగ్రామ్ మేనేజర్ దోమ అప్పలనాయుడు, జిల్లా ఎవిడెన్స్ సెల్ అబ్జర్వర్ నాగేశ్వరరావు, హెల్త్ ఎడ్యుకేటర్ మోహిని, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరసింహులు, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# తాత-మనవడు

## వయొలెంట్ లవ్ స్టోరీ.. దాసరి సినిమాకు సీక్వెల్


**తాతగారు..** ఏలూరు దగ్గర ఒక పల్లెటూళ్లో మధ్య తరగతి కుటుంబంలో జన్మించాడు. ఆత్మ విశ్వాసం, కృషి, పట్టుదల ఇంధనాలుగా అంచెలంచెలుగా ఎదిగాడు. రతన్ టాటాతో కలిసి చదివాడు. పారిశ్రామికవేత్త అయ్యాడు. కోట్లు గడించాడు. ముగ్గురు కూతుళ్లు, ఒక కొడుకు. పిల్లలకు ఆస్తులు ఇచ్చాడు. దానకర్ణుడు తిరుమల కొండకు రూ.50 కోట్లు ఇచ్చాడు. తాను చదివిన పల్లె బడికి రూ.5కోట్లు ఇచ్చాడు. వయసు 85.


**మనవడు** డబ్బుల్లో పుట్టాడు. తల్లి తండ్రితో విడిపోయింది. విలాసాల్లో విచ్చలవిడిగా పెరిగాడు. అడ్డు అదుపు లేదు. మద్యానికి బానిసయ్యాడు. తాతగారి డబ్బు.. అమెరికాలో ఉన్నత విద్యా సంస్థలో సీట్ ఇప్పించింది. డ్రగ్స్ పిచ్చి పట్టింది. ప్రేమ, అనురాగం, ఆప్యాయత, విచక్షణ.. లాంటి మానవ భావోద్వేగాలు మచ్చుకైనా లేవు. నార్సిస్టిక్ పర్సనాలిటీ డిసార్డర్, యాంటీ సోషల్ పర్సనాలిటీ డిసార్డర్. ద్వేషం, పగ ప్రతీకారం. తాతగారి కంపెనీ తాగుబోతు, తిరుగుబోతు, డ్రగ్స్‌కు బానిస అయిన మనవడికి డైరెక్టర్ పదవి ఇస్తే.. అందులో పనిచేసే ఉద్యోగులు నష్టపోతారు. తాను నాటిన చెట్టు తన కళ్లముందే కూలి పోతుంది. అందుకే తాతగారు ఆ పదవి ఈ మృగానికి ఇవ్వలేదు.


ఎంతైనా కూతురు కొడుకు కదా. మమకారం చావదు. బతకడానికి నాలుగు కోట్లు ఇచ్చాడు.

మనవడు.. నేరమయ నవ ప్రపంచానికి ప్రతినిధి. ఈ కాలం కుర్రాడు 'తొక్కలో డబ్బుదే ముంది బ్రో.. చిన్నప్పటి నుంచి తాను నోట్ల కట్టల్లో పెరిగాడు. డబ్బు ఇచ్చే సుఖాలను అనుభవించడం తెలుసు. కృషి పట్టుదల శ్రమ సహానుభూతి లాంటివి తనకు ఒంటబట్ట లేదు. వాటి అవసరమేముంది? తాతగారు సంపాదించింది చాలదా? 29 ఏళ్ల వయసు వచ్చింది. ఇప్పుడు తనకు సమాజంలో గుర్తింపు, గౌరవం కావాలి. పెత్తనం చెలాయించాలి. అదో తుత్తి. ఎంతసేపు తిని తొంగుంటే మడిషికి, గొడ్డుకి తేడా ఏటుంటది? ఇగో దాన్ని సాటిస్‌ఫై చెయ్యాలి. సూట్ వేసుకొని బోర్డు మీటింగ్స్‌కు వెళ్లాలి. ఆర్డర్స్ ఇవ్వాలి. చప్పట్లు కొట్టించుకోవాలి. లీడర్ అనిపించుకోవాలి.

తాత ఇచ్చిన నాలుగు కోట్లు ఓకే. 'కానీ కంపెనీకి డైరెక్టర్ చెయ్యమంటే ముసలోడు వినడే. ఎంతసేపు వాడు చెప్పిందే నడవాలా? ఎనభై ఏళ్లు వచ్చినా అంత ఇగోనా? నేనేంటో చూపుతా. దెబ్బకు అకౌంట్ సెటిల్ అయిపోవాలి. ముసలోడు చావాలి.. కుక్కచావు చావాలి'. అందుకే కసి తీరా










వెల్జన్ ఇండస్ట్రీస్ అధినేత వీసీ జనార్ధన్ రావు హత్య

ఆస్తి వివాదంలో మనవడి ఘాతుకం.. ఉన్మాదిలా మారి కత్తితో దాడి

- 70కి పైగా కత్తిపోట్లకు గురై జనార్దన్‌రావు మరణం
- పోలీసుల అదుపులో నిందితుడు కీర్తితేజ
- జనార్దన్ రావు రతన్‌టాటా సహాధ్యాయి
- వ్యాపారవేత్త, వితరణశీలిగా ప్రఖ్యాతి
- గుప్త దానాలు, సేవా కార్యక్రమాలు

వీసీ జనార్దన్ రావు(ఫైల్)

గుప్త దాత, వితరణశీలి, ఆదర్శప్రాయుడు

పొడిచి పొడిచి చంపేశాడు. ఒక్కసారి కాదు.. మెడపై డజనుసార్లు, ఒంటిపై డెబ్బై సార్లు పొడిచి కసిగా, తనివితీరా చంపేశాడు. తల్లి అడ్డొచ్చింది. 'కొడుకంటే ప్రేమ లేదా? తనకు సమాజంలో గౌరవం వద్దా? ముసలాడికి చెప్పొచ్చుగా? అందుకే.. తాతను పొడిచిన కత్తితోనే తల్లిని కూడా పొడిచాడు. ముసలాడు పోయాడు. తల్లి ఇప్పటికి బతికింది. తనను పోలీసులు పట్టుకొంటారని తెలుసు. అయితేనేమి? పగ ప్రతీకారం ముఖ్యం. తనకు పదవినివ్వని తాత చావాలి. తల్లి కూడా చావాలి.

నవమాసాలు మోయడం లాంటి తొక్కలో కబుర్లు వద్దమ్మా. తాగామా.. డ్రగ్స్ తీసుకొన్నామా.. ఎంజాయ్ చేశామా.. ఇదే జీవితం. అవును నాకు జీవితం ఇదే నేర్పింది. నేను ఈ కాలం కుర్రాడిని. 'నిజజీవిత కథలో నీతి, ఆస్తులు సంపాదిస్తారు. పిల్లలు, మనవలు, మనుమరాండ్రు చల్లగా ఉండాలని వారి కష్టం కూడా మీరే పడుతూ వారికి కష్టం తెలియక కష్టపడాల్సిన అవసరం లేకుండా వారి బతుకు కూడా మీరే బతికేస్తారు డబ్బు సంపాదనలో మీరు.

**డబ్బు కావాలి.. డబ్బు సంపాదించాలి.. నిజమే.. కానీ బాలన్స్ తెలియాలిగా?..** పిల్లకు కేవలం డబ్బే ఇచ్చి.. మీ సమయం ఇవ్వక పెంచితే? వారు మృగాలు అవుతారు. రాక్షసులు అవుతారు. తప్పెవరిది? మీ అమ్మ నాన్న మిమ్మల్ని ఇలాగే పెంచారా? డబ్బు ఇవ్వకపోయినా వారు మీకు సమయం ఇచ్చారు. ప్రేమ, అనురాగం ఆప్యాయత నేర్పారు. మరి మీరు? చంద్రునిలో కుందేలు ఉందని మీరు మాత్రమే విన్నారు. గోరుముద్దలు తిన్న.. అనగనగాతో.. మొదలెట్టి కంచికికి చేరే దాక.. కథలు విన్న.. చివరి తరం మీది.

'ఈ కాలం యువత సెల్‌ఫోన్‌కు, నీలిచిత్రాలకు, మద్యానికి, డ్రగ్స్‌కు బానిస అని మీ పెద్దలు అంటున్నారు. మీరు మాత్రం సంపాదన వ్యసనపరులు కాదా? స్టేటస్ పిచ్చి మీకు లేదా? మా బాల్యాన్ని దోచిన దొంగలు మీరు కదా? మీరున్నది ఒక తీరు.. మమ్మల్నే తప్పుపడతారు ఎందుకు?'. యువఘోష.. మీరు సంపాదించిన డబ్బు.. దిండు కింద నాగు! చేతిలో డబ్బు.. ఇంట్లో.. తల్లి తండ్రి ప్రేమ కరువు. చెడు సావాసాలు. చెడిపోరా? అసలు మంచి-చెడు అంటే ఏంటో వారికి బాల్యంలో నేర్పారా? డబ్బుతో చదువు కొన్నారు. కారు కొన్నారు. బంగ్లా కొన్నారు. కానీ.. మానవత్వాన్ని కొనగలరా?

మీకు డబ్బే ముఖ్యం. అందుకే మీ డబ్బే మీకు ఇప్పుడు ఉరితాడు. మానవత్వం నేర్పని నేటి కుర్రరికం, డబ్బుపిచ్చి పట్టిన పెద్దరికంపై పగ తీర్చుకొంటోంది. అయ్యో పెద్దాయనా! మధ్య తరగతి నేపథ్యం, డబ్బు పెద్దగా లేకపోవడం, మీలో కసి పెంచింది. కష్టించి పని చేసేలా చేసింది. నాయకత్వ లక్షణాలు అలవాటు చేసింది. తరం మారింది. కూతురు మీ ఇంట్లో ఉంది. కొడుకును ఎలా పెంచిందో చూడు! వాడి పెంపకం.. కుటుంబ నేపథ్యం.. విలాసాలకు బానిస చేసింది. పాజిటివ్ భావోద్వేగ లక్షణాలు చంపేసింది. ఏంటి నీకు ఈ శిక్ష పెద్దాయనా! డబ్బు సంపాదించాలి. నిజమే. అంతకంటే పిల్లల్ని ఎలా పెంచాలో నేర్వాలి. వారితో టైం గడపాలి. వివాహ కుటుంబ వ్యవస్థలను గౌరవించాలి.

- వాసిరెడ్డి అమర్నాథ్

# ప్రణాళికతో చదివితే మంచి ఫలితాలు

## - జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ తిరుమల చైతన్య -



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

కాలాన్ని సద్వినియోగం చేసుకొని, చక్కని ప్రణాళికాబద్ధంగా విద్యను అభ్యసిస్తే మంచి ఫలితాలు సాధించవచ్చని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఇచ్చిన విలువైన సూచన ప్రతిఒక్కరూ పాటించి ఉత్తమ పౌరులుగా తయారు కావాలని జిల్లా విద్యా శాఖాధికారి డాక్టర్ సదాశివుని తిరుమలచైతన్య అన్నారు. నగరంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో సోమవారం ఏర్పాటు చేసిన పరీక్షా పే చర్చ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ స్వాతంత్ర్యానంతరం ఎందరో మహానుభావులు దేశాన్ని పాలించినా అన్ని వర్గాల ప్రజల ఆదరాభిమానాలు చూరగొన్న ఏకైక ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అని చెప్పకతప్పదన్నారు. దేశ భవితకు బాటలు వేసే ప్రధాన మంత్రి మోడీ విద్యార్థులనుద్దేశించి ఇచ్చిన సందేశం ఎంతో స్ఫూర్తి నింపుతుందని కొనియాడారు. శ్రీకాకుళం జిల్లాలో ఆరవ తరగతి నుంచి పదవ తరగతి వరకూ చదువుతున్న 1.50 లక్షల మంది విద్యార్థులు ఈ బృహత్తర కార్యక్రమాన్ని తిలకించే విధంగా అన్నిరకాల ఏర్పాట్లు చేశామని చెప్పారు. దేశంలో విద్యాభివృద్ధికి తీసుకుంటున్న, తీసుకోబోతున్న చర్యలు ప్రధాని వివరించారు. ముఖ్యంగా పరీక్షల ముందు విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం నింపడం, వారిలో ఉన్న భయాన్ని పోగొట్టేందుకు పరీక్షాపే చర్చ ఎంతో ఉపకరిస్తుందని అన్నారు. శ్రీకాకుళం జిల్లాలో ఉన్న 30 మండలాల్లో పరీక్షా పే చర్చ లైవ్ ప్రోగ్రాం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించారు. కార్యక్రమంలో స్కూల్ ప్రధానోపాధ్యాయులు వాగ్దేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రైతులకు బ్యాంకుల సాయమందాలి

(సత్యంన్యూస్, అమరావతి)

రైతులకు మేలు చేకూరేవిధంగా బ్యాంకుల సహకారం ఎంతగానో దోహదపడుతుందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. సోమవారం అమరావతి సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన నిర్వహించిన రాష్ట్రస్థాయి బ్యాంకర్స్ కమిటీ సమావేశంలో అచ్చెన్నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు అంశాలపై మాట్లాడారు. ఈ సమావేశంలో సహచర మంత్రులు పాల్గొన్నారు.



# నులిపురుగులవ్యాధితో రక్తహీనత

(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)

పిల్లల్లో వ్యక్తిగత పరిశుభ్రత లోపం కారణంగా నులిపురుగుల వ్యాధికి గురవుతుంటారని, తీవ్ర రక్తహీనతకు గురై ఎదుగుదల లోపిస్తుందని, వ్యాధి నిరోధక శక్తిని కోల్పోయి తరచూ కడుపు నొప్పి, వాంతులు, మలద్వారం వద్ద దురద, నిద్రలేమి వంటి అనారోగ్యాలకు గురవుతుంటారని హెల్త్ అసిస్టెంట్ ఇప్పిలి చిట్టిబాబు తెలిపారు. నులిపురుగుల నివారణకు ఏడాదికి రెండుసార్లు ప్రభుత్వం డీ-వార్మింగ్ కార్యక్రమం నిర్వహిస్తూ ఉచితంగా ఆల్బెండజోల్ మాత్రలను అందిస్తోందన్నారు. పొన్నాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల / కళాశాలలో విద్యార్థులతో సోమవారం ఆల్బెండజోల్ మాత్రలను నమిలించి మింగించారు. కార్యక్రమంలో గురుకులం ప్రిన్సిపాల్ బుచ్చి రాజు, ఏఎన్ఎం కమల, సురేంద్ర కుమార్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



### సమస్యల పరిష్కారానికి

## కూటమి ప్రభుత్వం కృషి





(సత్యంన్యూస్, నరసన్నపేట)

సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. సోమవారం పోలాకి మండలపరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున హామీలు ఇప్పుడు చెప్పలేమని, కోడ్ అయిన తర్వాత సమస్యల పరిష్కారంపై దృష్టి సారిస్తామన్నారు. ఇప్పటికే పలు రహదారుల నిర్మాణాలను యుద్ధ ప్రాతిపదికన చేపట్టామని వివరించారు. పోలాకి మండలంలో ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ, జడ్పిటిసి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

## షిరిడీసాయి ఆలయ ద్వితీయ వార్షికోత్సవం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



అరసవిల్లి కళింగరోడ్డులోని షిరిడీసాయి బాబా తత్వ ప్రచార మందిర కమిటీ ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా చందన పుష్పాలతో స్వామివారి పూజలు జరిపించారు. శ్రీకాకుళం నగర బీసీ సెల్ అధ్యక్షులు ఉంగటి రమణమూర్తి, ఆలయ కమిటీ చైర్మన్ ముద్దాడ అప్పలనాయుడు, వైస్‌చైర్మన్ దోర సన్యాసిరాజు, కార్యదర్శి వరద సత్యనారాయణ, జనరల్ కార్యదర్శి కోరాడ శ్రీనివాస్, ఆర్గనైజేషన్ కార్యదర్శి దంపాక రమణమూర్తి, ముఖ్య సలహాదారు ముద్దాడ పద్మావతి ఆధ్వర్యంలో సాయి భక్తులు, మహిళల సమక్షంలో స్వామివారి చందన ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. సాయినాధుని విగ్రహం కోసం కొయ్యాన ప్రమీల రూ.15 లక్షలు అందించారు. ఈ సందర్భంగా నగర బీసీ సెల్ అధ్యక్షులు రమణమూర్తి మాట్లాడుతూ ఇలాంటి సేవా కార్యక్రమాలు ప్రతిఒక్కరు చేయాలని కోరారు. ఆలయ అభివృద్ధికి అరసవిల్లి, ఖాజీపేట, ఆదిత్యనగర్, అరసవల్లి గ్రామపెద్దలు, యువత సహకారం ఎంతో ఉందన్నారు. అలాగే రథసప్తమికి అరసవల్లికి వచ్చిన భక్తులకు వీరు సేవ చేసి తమ ఊరికి మంచి పేరు తెచ్చారని రమణమూర్తి కొనియాడారు.









Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.